కథానిక

# ప్రలోభానికి పరిహద్దులు

స్వామి

వెంకయ్యగారింట్లో ఎవరికో వీపు విమానం మోత మ్రోగుతోంది. కర్ణకఠోరమైన కర్కశస్వరంతో ఒక పురుషకంఠం, నల్లేరుమీద బండిలాగ, నిరాఘాటంగా అంతులేని అసభ్యపు తిట్లు తిడుతోంది. ఇంకొక స్త్రీకంఠం దుర్భరమైన దుఃఖంతో అతి నిస్సహాయ దశలో ఆర్తనాదం చేస్తోంది. అయినా ఆ యభాగ్యురాలి ఆర్తినితీర్చే ఆర్తత్రాణ పరాయణు లెవ్వరూ లే రక్కడ. ఇరుగుపొరుగు ఆ సామంతా "మాకేమ"ని ఇండ్లల్లో దూరి కూర్చున్నారు.

ఆ యింట్లోనుంచి రోజూ ఇటువంటి ఆర్తనాదం వినిపించటం వారికి పరిపాటైపోయింది. హృదయంలో కరుణారసం పొంగి పొరలినప్పుడు, దానిని కార్యరూపంలో కనబడనియ్యకుండా అణచివేస్తూవుంటే క్రమంగా ఆ కరుణభావం అణాగారిపోతుంది. మానవుడు దానవుడైపోతాడు.

వెంకయ్యగారి ఎదురుగానిలబడి "ఇదితప్పు" అని చెప్పటానికి ఎన్నివేల గుండెలుండాలి! పోరుపెట్టి ఏడుస్తున్న పసిపాపలుకూడా వెంకయ్యగారి పేరు వినేసరికి ఏడుపు మానేస్తారు. తల్లి పొదుగులో పాలు కుడుచుకుంటున్న లేగదూడలు కూడా ఆయన కంఠస్వరం వినేసరికి కంగారుపడి పాలువిడిచి పారిపోతాయి. ఆయనగర్జన సింహగర్జన. ఆయన కాయం వజ్రకాయం. ఆయనతో వైరం పెట్టుకోటం కొరివితో తల గోక్కోవట మన్నమాటే. సింహంతో చెలగాట మాడటానికి ఎవరు సిద్ధపడతారు? ఎవరి ప్రాణం వారికి తీపి కదూ!

* * *

వెంకయ్యగారి ధర్మపత్ని సుబ్బమ్మగారు, ఆవిడఅప్పగారైన మంగమ్మగారు, తల్లిదండ్రులకు పుత్రసంతానం లేకపోవటంవల్ల వారి ఆస్తికి వారసులయారు. సుబ్బమ్మగారికీ, మంగమ్మగారికి తనువులు వేరైనా మనసు లొకటే. ఆస్తి విభాగం చేసుకోకుండా కృతయుగంలో మనుష్యులలాగ కలసిమెలసి యుండేవారు. వాళ్ళ సోదరీప్రేమను చూసి భగవంతుడికే కళ్లు కుట్టాయి. అకాలంలోనే అప్పచెల్లెళ్ళ నిద్దర్నీ వేరుచేశాడు, మాయ వారి దేవుడు. మంగమ్మగారు తన మగబిడ్డను సుబ్బమ్మగారి చేతిలోపెట్టి మరణించింది. కన్నబిడ్డల కన్నకడుపు తీపితో ఆ పిల్లవాణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేసింది సుబ్బమ్మగారు.

వెంకట్రావు జ్ఞానం తెలిసినతరువాత తన తల్లి వాటా ఆస్తిని తనకు పంచిపెట్టమన్నాడు. అంతకాలంవరకు అత్తవారి ఆస్తినంతను నిరాటంకంగా అనుభవిస్తున్న వెంకయ్యగారికి పచ్చివెలక్కాయ గొంతులో అడ్డం పడ్డట్టయింది. వ్యవహారకుశలులైన పెద్దమనుష్యులతో సంప్రదించాడు. అక్కచెల్లెళ్ళలో ఎవరైనా తల్లిదండ్రుల ఆస్తిని పంచుకోకుండా స్వర్గస్థులైతే, ఆమె పిల్లలకు ఆస్తిపంచవలసినఅగత్యంలేదని "లా"లో ఉన్నదని వార్లు వక్కాణించారు. ఇంక కావలసిందేముంది? వెంకయ్యగారికి ఏనుగు నెక్కినంత సంతోషం కలిగింది. "అత్తవారి ఆస్తి కంతకూ నేనే ఏకచ్ఛత్రాధిపతిని గదా!" అనుకున్నాడు మీసం మెలిపెడుతూ.

వెంకట్రావుతో "నీకు ఆస్తిలో ఆవగింజంతైనా హక్కులేదు. కావలిస్తే పోయి కోర్టులో దావా వేసుకో" అన్నాడు వెంకయ్యగారు.

వెంకట్రావు విధిలేక కోర్టులో దావా ఫైలు చేశాడు. ఆనాటినుండి వెంకయ్యగారి యిల్లు రణరంగంగా మారింది. వెంకయ్యగారు అసహాయశూరుడై వీరవిహారం చేయసాగాడు. అతని స్వైరవిహారానికి అడ్డుతగిలే అఖండు డెవడున్నాడు!

రోజూ ఒకసారి సుబ్బమ్మగారిమీద, జువ్వకర్రతో దండయాత్ర సాగించటం, ఒళ్ళంతా చితకగొట్టడం, వెంకయ్యగారికి నిత్యకర్మ ఐంది. "పాముకి పాలుపోసి పెంచావు" అని ఆమెను వేధించసాగాడు. "మేము మా తలిదండ్రుల

ఆస్తిని పంచుకోకుండా మా అప్పగారు మరణించినందున వెంకట్రావుకేమీ దక్కకుండా, మాకే మొత్తమంతా రావాల"ని కోర్టులో వాఙ్మూలమిస్తావా, లేదా?-అంటూ చావదన్నేవాడు. ఎంత అత్యాచారం చేసినా ఆ తల్లిమాత్రం అచలంగా తన పట్టుదలమీదనే నిలబడివుంది. "నా కొడుకు వేరు, నా అప్పకొడుకు వేరు, కాదు. వాడికి అన్యాయం చెయ్యటానికి నేను ఎంతమాత్రం ఒప్పుకోను. మా ఆస్తిలో అతనికి సగం పంచి ఇవ్వవలసినదే" అని గట్టిగా చెప్పేది. ఈప్రకారం ఆదంపతుల కిద్దరికీ నిత్యసంగ్రామం జరుగసాగింది.

కోర్టులో విచారణ ప్రారంభమయింది. జడ్జిగారు సుబ్బమ్మగారి వాఙ్మూలం తీసుకున్నారు. ఎంతపట్టుదలగల మనిషైనా సుబ్బమ్మగారు చివరకు భర్తగారి జువ్వకర్ర దెబ్బలకు లొంగక తప్పలేదు. భర్తకు అనుకూలంగానే వాఙ్మూలమిచ్చినది. జడ్జి కూడా వెంకయ్యగారికి అనుకూలంగానే తీర్పునిచ్చాడు.

కాని ఇంటికి వచ్చిన తరువాత సుబ్బమ్మగారి హృదయావేదన వర్ణించ తరముగాదు. నోటిలోకి ముద్దపోలేదు. కంటిమీద కునుకులేదు. స్వర్గలోకంలోనుంచి మంగమ్మగారు గుడ్లురిమిచూస్తూ "నీమీద నమ్మకంతో వున్నందుకు, నువ్వునాకు చేసిన ఉపకారం యిదేనా? మన గాఢమైత్రికిదేనా ప్రతిఫలం? నా పిల్లవాడు బిచ్చగాడైతే నీ పిల్లవాడు సుఖంగా వుంటాడా? దైవంలేడా" అని గర్జిస్తున్నట్లు కనిపించింది.

అదిరిపడి లేచి కూర్చుంది సుబ్బమ్మగారు, "అయ్యో! నా శరీర యాతనను సహించలేక ఎంత ఘోరం చేశాను! నాకంటె కృతఘ్నురాలెవరు వుంటుంది?" అని పశ్చాత్తాపపడింది. "తప్పక ప్రాయశ్చిత్తంచేసుకోవాల"ని నిర్ణయించుకుంది. మర్నాడు ప్రొద్దున్నే లేచి కాలవస్నానానికి వెడుతూ దారిలో రహస్యంగా వెంకట్రావుని పిలిచి తన మెడలో వున్న కాసులపేరు అతని చేతిలో పెట్టింది. "నిన్న పొరపాటు చేశా నాయనా. పోయి హైకోర్టులో అప్పీలుచేసుకో. ఈసారి ఏమైనాసరే, నేను సరిగా వాఙ్మూలమిస్తాను" అంది. వెంకట్రావు పోయి అప్పీలు ప్రయత్నం ప్రారంభించాడు.

క్రింది కోర్టులో గెలవటంతోటే "శని విరగడైపోయింద"ని వెంకయ్యగారు కాలుమీదకాలు వేసుకుని నిశ్చింతగా కాలం గడుపుతున్నాడు. ఇంతట్లోకే హైకోర్టునుంచి ఒక రోజున సమను రావటంతోనే నిలువునా నీరయిపోయాడు. పిడుగుపడినట్లు కూలిపోయాడు. "చేతిలో చిల్లిగవ్వయినా లేకుండా హైకోర్టుకి ఎలా వెళ్ళగలిగాడా వెంకట్రావు?" అని సందేహం అతనికి. మళ్ళీ సుబ్బమ్మగారిమీద బలప్రయోగం ప్రారంభించాడు. ఈసారి సుబ్బమ్మగారి నిశ్చయం అచంచలంగావుంది. ప్రాణాలు పోయినాసరే పట్టు విడువకూడదనుకుంది. ఆమె సత్యాగ్రహం ముందు వెంకయ్యగారి వెర్రిచేష్టలువ్యర్థమయాయి.

హైకోర్టులో విచారణ ప్రారంభమయింది. ఈసారి సుబ్బమ్మగారు స్పష్టంగా చెప్పింది-దాని పర్యవసానం ఏమైనాసరేననే ధైర్యంతో -"నా కొడుక్కీ, నా అప్పకొడుక్కీ, నేను ఏ విధమైన భేదము పాటించను. మా తలిదండ్రుల ఆస్తి వీరిద్దరికీ సమముగా పంచిపెట్టడమే నా అభిమతము" అని వాఙ్మూలమిచ్చింది. జడ్జిగారు కేసునంతను విచారణచేసి "సుబ్బమ్మగారు జీవించినంతకాలం వారి తల్లిదండ్రుల ఆస్తిలో సగం వెంకట్రావుగారికి అనుభవించటానికిహక్కుంది." అని తీర్పు చెప్పాడు. "అధమపక్షం నేనుజీవించినంతకాలమైనా మా వెంకట్రావు సుఖంగా వుంటాడు గదా, నేను కష్టపడినా ఫరవాలేద"ని సుబ్బమ్మగారు సంతృప్తి పడింది. కోర్టునుంచి ఇవతలికి వస్తూవుంటే, "ఇంటికి నడు ముందుంది ముసళ్ళ పండుగ"అని గుడ్లెర్రజేశాడు వెంకయ్యగారు. "భూమిమీద నాకు నూకలున్నంతసేపు మీరేం చేస్తారులెండి" అన్నట్లు నిర్లక్ష్యంగా వెంకయ్యగారి వైపు చూస్తూ సుబ్బమ్మగారు ముందుకు నడిచింది.

* * *

ఇంటికి చేరిననాటినుండి సుబ్బమ్మగారికి నరకయాతన ప్రారంభమయింది. ఆమె సుఖంగా కడుపునిండా తిండితిని, కంటినిండా నిద్రపోయిన రోజు ఒకటికూడాలేదు. వెంకయ్యగారి విపరీత క్రోధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఎవరికీ లేకపోవటంవల్ల అతనికి అడ్డొచ్చే వారెవరూలేరు. నిత్యకర్మగా ఆమెను ఎన్నిరోజులు చితక పొడి

చినా, ఆయన క్రోధాగ్ని చల్లారటంలేదు. ఆమెకు ఎటువంటి దండన విధిస్తే తన క్రోధం చల్లారుతుందో, పగ తీరుతుందో, ఆయనకే తెలియటంలేదు. అనేక అమానుషమైన ప్రయోగాలుచేసి చూశాడు. చివరకు వృద్ధాప్యం వచ్చి లేవలేని స్థితిలో కూడా ఆమెయందు క్రోధం తగ్గలేదు. ఆఖరు క్షణం వరకు ఆమెను వేధించి అజ్ఞాత యాత్రకు వెళ్ళిపోయాడు.

"సిరిరా మోకాలొడ్డువాడెవడు?" వెంకయ్యగారి సుపుత్రుడు సుందరంకూడా తండ్రిపోయిన పుంతనే పోదామని నిశ్చయించాడు. "మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః" అని ఏనాడో పెద్దలు చెప్పినట్లుగా, సుబ్బమ్మగారి సుపుత్రుడు, మాతృభక్తి మాట మరచి, ధనకాంక్షతో తల్లి మరణంకోసం రోజులు లెక్కపెట్టసాగాడు. తల్లి మరణించినట్లయితే మాతామహుల ఆస్తికంతకూ తానే హక్కుదారుడనౌతానని ఉవ్విళ్ళూరుతున్నాడు. కాని వాన రాకడ ప్రాణపోకడ ఎవరికి తెలుస్తుంది?

*　　*　　*

రోజులు గడచిపోతున్నాయి. లోకమర్యాదకోసం, సుందరం తల్లిని పైకి నిందించకపోయినా లోపలమాత్రం "ఇంతకాలం బ్రతుకుతూందేమిటి ముసలిముండ?" అనుకోకపోవటంలేదు. కాని భవిష్యత్తుమీద ఆశ పెట్టుకుని కాలంగడుపుతున్నాడు. ఆఖరికి అతనికి కావలసినరోజువచ్చింది. పండినకాయ రాలకుండా ఎంతకాలంవుంటుంది? తల్లి పోయిందనే శోకమన్నా లేకుండా, కర్మకాండ పూర్తి అయినవెంటనే తండ్రి తనకొప్పగించిన, వెనుకటి రికార్డు తీసుకుని కోర్టుకుప్రయాణమయాడు. వెంకట్రావుమీద అతడనుభవిస్తున్న ఆస్తిని స్వాధీనం చెయ్యవలసినదని దావాదాఖలు చేశాడు. విస్తట్లో వడ్డించుకొనితింటున్న అన్నం కుక్క తినిపోతే ఎంత కష్టంగావుంటుంది! దావా మాట విని వెంకట్రావు హృదయం దహించుకుపోయింది, అయినా "దేవుడు లేడా" అనే ధీమాతో శ్రీధర్ల వెనకాల తిరగటం మొదలుపెట్టాడు, "నీవేతప్ప నితఃపరంబెరుగ" నని స్తోత్రపాఠాలు ప్రారంభించాడు. మొదటిసారి పినతల్లి సహాయంచేసిందిగనుక గండంగడిచి బయటపడ్డాడు కాని ఇప్పుడెలాగ? తను మాస్టరీచేసి సంపాదించే అరవై రూపాయలజీతము కుటుంబ పోషణకే సరిపోదు. ఎలాగో అప్పోసప్పోచేసి దావాలో గెలపడానికి ప్రయత్నించాలి. దేవుడి ధర్మమా అని దావా గెలిస్తే అప్పు తీరుతుంది. లేకపోతే చేతికి రాగిచెంబే గతి.

కోర్టులో మళ్ళీ విచారణ ప్రారంభమయింది. వెనుకటి రికార్డులను పరిశీలించి, వెనుకటి జడ్జి ఇచ్చిన తీర్పననుసరించి సుబ్బమ్మగారి మరణానంతరము, వెంకట్రావు ఆస్తినంతనూ సుందరానికి స్వాధీనపరచాలని తీర్పు చెప్పబడింది. దానితో వెంకట్రావుగుండె గుభేలుమంది. అయితేమాత్రం ఏమి చేస్తాడు?

తీర్పు వినడంతోనే సుందరానికి పట్టరానంత సంతోషంకలిగింది. శాశ్వతంగా ఆస్తినంతనూ తానే అనుభవించవచ్చు ననుకున్నాడు. కాని బ్రహ్మవ్రాత తప్పించటం ఎవరితరం? ఇంటికి రాగానే మంచం ఎక్కాడు. మొదట్లో బడలిక చేసిందనుకున్నారు. కాని టైఫాయిడ్ జ్వరం— దాంట్లో సంధించింది. ఇంకేముంది! పరిస్థితి విషమించింది. సుందరం తన మనోభిలాషలను మట్టిపాలుచేసి ఇహలోకయాత్ర ముగించాడు.

*　　*　　*

సుందరంగారి పుత్రుడు సుబ్రహ్మణ్యం చాలా యోగ్యమైన యువకుడు, బుద్ధిశాలి. తాతగారి, నాయనమ్మగారి, చరిత్రలను స్వయంగా ఎరుగకపోయినా, ఇతరులవలన విని, భావుకుడవటంవల్ల వాటినిగురించి పర్యాలోచన చేశాడు. తండ్రిచేసిన ప్రయత్నం, చివరకు అతనికి లభించిన పర్యవసానం, కళ్ళారా చూశాడు. "ఎంత సంపాదించినాకూడా తీసుకుపోయేవారెవరు? చివరికి మిగిలేవి మంచి చెడ్డలు మాత్రమేకదా!" అని ఆలోచించాడు. వెంకట్రావు అప్పులపాలై అహర్నిశాలు అష్టకష్టాలు పడుతూవుండటం కళ్ళారా చూస్తున్నాడు. వెంకట్రావు తల్లి, అప్పకొడుకుకోసం ఆత్మార్పణ చేసిననాయనమ్మ, పరలోకంలోనుండి అతని కష్టాలుచూచి ఎంత దుఃఖించుతున్నారో గదాయని ఊహించాడు. కాని ప్రస్తుతం తన కర్తవ్యమేమిటి? అనే ప్రశ్న అతనిని పీడిస్తోంది. తానేమి అన్యాయంచేశాడు? కోర్టువారిన్యాయం ప్రకారం సంక్రమించిన ఆస్తిని తాను అనుభవిస్తున్నాడు. ఇందులో తప్పేముంది? కాని అతని

అంతరాత్మ ఘోషిస్తోంది—ఇది న్యాయం కాదని. అది లౌకిక దృష్టిలో న్యాయం కావచ్చు-కాని నైతిక దృష్టిలో...?

చివరకు అతడొక స్థిరనిశ్చయానికి వచ్చాడు. అతని హృదయమంథన తగ్గింది. ఒకరోజున ఉదయాన్నే వెంకట్రావుగారింటికి వెళ్ళాడు. అప్పుడే, వెంకట్రావుకి అప్పిచ్చిన నారాయణ సెట్టి వెంకట్రావుతో జగడమాడి, "ఒకవారం రోజుల్లో నా సొమ్ము జమకట్టకపోతే నీమీద దావావేసి, పుస్తెపూస సహితంగా వేలం వేయించి నా బాకీ రాబట్టుకుంటా"నని హెచ్చరించి పోతున్నాడు.

"నా తండ్రి తాతలు చేసిన అన్యాయానికి ఫలితంగదా యిది" అని సుబ్రహ్మణ్యం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వెంకట్రావునెలా పలకరించాలో తెలియలేదతనికి. సుబ్రహ్మణ్యాన్ని చూచి జేల ముఖం పెట్టాడు వెంకట్రావు.

ఆఖరుకి సుబ్రహ్మణ్యం సాహసించి "మీ కోసమే వచ్చానండి" అని నోరువిప్పి అన్నాడు.

"ఏం, ఇంకా ఏమైనావుంటే దోచుకుపోదామని వచ్చావా?" అన్నాడు వెంకట్రావు వెటకారంగా.

సిగ్గుతో సుబ్రహ్మణ్యం తలదించుకుపోయింది.

"క్షమించండి. మీతో కొంచెం మనవిచెయ్యడానికి వచ్చాను. చచ్చిన పాముని ఇంకా చంపకండి" అన్నాడు ధైర్యంతెచ్చుకుని సుబ్రహ్మణ్యం.

సుబ్రహ్మణ్యం సౌజన్యంచూచి వెంకట్రావు మెత్తపడ్డాడు.

"ఇలా కూర్చో ఈ బల్లమీద. ఏం పనిమీద వచ్చావు?" అని ప్రశ్నించాడు.

సుబ్రహ్మణ్యం వంచిన తల ఎత్తకుండానే మాట్లాడుతున్నాడు.

"మా తాత, తండ్రులు మీకు చాలా అన్యాయం చేశారు. దానికి ప్రతీకారం చెయ్యటానికి వచ్చాను."

వెంకట్రావు విస్తుపోయాడు. "అదేమిటి అలా మాట్లాడుతున్నావు?" అని ప్రశ్నించాడు.

"ఏముంది! మీకు రావలసిన వాటా భూమి మీకు ఇచ్చెయ్యాలని వచ్చాను. ఈ రోజునే మనం కోర్టుకి వెళ్ళడానికి తగిన కార్యకలాపాలు సాగించుదాము. త్వరగా భోజనంచేసి సిద్ధంగా వుండండి" అంటూ సుబ్రహ్మణ్యం లేచి నిలబడ్డాడు.

"మా పాపకర్మంచేత మేమిలా అవస్థపడుతున్నాము. మాకోసంనువ్వింతత్యాగం చెయ్యటమెందుకు నాయనా?" అన్నాడు వెంకట్రావు గద్గద స్వరంతో.

"ఇది త్యాగంకాదు. మా పెద్దల పాపానికి ప్రాయశ్చిత్తం" అన్నాడు సుబ్రహ్మణ్యం.

హృదయంలోనుంచి పొంగిపొర్లే ఆనందాన్ని పట్టలేక వెంకట్రావు సుబ్రహ్మణ్యాన్ని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. "ఇతను మనుష్యుడా? దేవతా?" అని ఆలోచిస్తూ.

స్వర్గలోకంనుంచి మంగమ్మగారు, సుబ్బమ్మగారు వారిద్దరిమీదా ఆశీర్వాదవర్షం కురిపించారు.

* * *

"సుబ్రహ్మణ్యం వెర్రివాడు. కోర్టుద్వారా న్యాయరీత్యా సంక్రమించిన ఆస్తిని వెంకట్రావుకి స్వాధీనపరచాడు." అన్నారు లౌకిక వ్యవహార దక్షులు జాలిగా.

"సుబ్రహ్మణ్యం ఉత్తమ మానవుడు. అతడు మానవోచిత ధర్మాన్ని నెరవేర్చాడు" అన్నారు నైతిక తత్వవేత్తలు సంతోషంతో.

---

కాలేజీ లెక్చరరు క్లాసులో ఒకదంపుడు ఉపన్యాసం చెప్పుకుపోతున్నాడు. ఇంతలో ఓ విద్యార్థి బెంచీమీద నిద్రపోతూండడం గమనించి ఆ పక్కనే ఉన్న కుర్రాణ్ణి, "చూడూ, ఆ నిద్రపోయే మొద్దుని కాస్త లేపు!" అన్నాడు.

ఆ కుర్రాడు తడుముకోకుండా, "మీరే లేపండి మేష్టారూ! వాణ్ణి జోలపాడి నిద్రపుచ్చింది మీ లెక్చరే గదా!" అన్నాడు.